క్లుప్తంగా

అంతర్జాతీయ సదస్సుకు చంద్రారెడ్డి



చంద్రారెడ్డిని అభినందిస్తున్న ఆర్‌జేడీ నాగమణి తదితరులు

బాలాజీచెరువు: ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు గోడరిగుంట మదర్ థెరీసా మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు కేఆర్ఎస్ చంద్రారెడ్డికి ఆహ్వానం అందింది. ఈ ఉత్సవాన్ని కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వ ఎర్త్ సైన్సెస్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. జీవశాస్త్ర బోధనలో నూతన పోకడలు అనే అంశంపై ఈ సదస్సులో ఆయన పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. హర్యానాలో ఫరీదాబాద్‌లో ఈ నెల 17 నుంచి 20 వరకూ జరగనున్న ఉత్సవాలనకు దేశ విదేశాల శాస్త్రవేత్తలతో పాటు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డిని జిల్లా అధికారులు అభినందించారు.

నూతన వస్త్రాల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న కోరమండల్ మహిళా క్లబ్ కార్యదర్శి మల్లీశ్వరి

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో కోరమండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నూతన వస్త్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ కార్యదర్శి మల్లీశ్వరి మాట్లాడుతూ తమ క్లబ్ అధ్యక్షురాలు వెంకట దుర్గావతి సూచనల మేరకు ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీదేవి, విజయలక్ష్మి, పద్మ, చింతపల్లి సుబ్బారావు, రాజా, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మెల్విన్ జోన్స్ జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం సభ్యులు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వేదుల శ్రీరామ శర్మ మాట్లాడుతూ 1879 జనవరి 13న అమెరికా జన్మించిన జోన్స్ స్థాపించిన ఈ సంస్థ మహా వృక్షమై విస్తరించిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 207కు పైగా దేశాలలో 46 వేలకు పైగా క్లబ్బులతో 1.4 మిలియన్ల సభ్యులతో అనునిత్యం జనహిత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు శర్మ తెలిపారు. అడబాల రత్న ప్రసాద్, ఎస్. శ్రీ నగేష్ రామారావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

మార్నింగ్ స్టార్స్ షటిల్ టోర్నీ విజేతలు రామకృష్ణ, నవీన్



విజేతలు రామకృష్ణ, నవీన్‌లకు షీల్డ్ అందిస్తున్న ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కృష్ణంరాజు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆఫీసర్స్ క్లబ్ మార్నింగ్ స్టార్స్ షటిల్ టోర్నీ విజేతలుగా యు.రామకృష్ణ, నవీన్ నిలిచారు. సంక్రాంతి సందర్భంగా శనివారం స్థానిక ఆఫీసర్స్ క్లబ్‌లో షటిల్ పోటీలు నిర్వహించారు. లీగ్ పద్ధతిలో నిర్వహించిన ఈ పోటీలలో 16 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలలో రన్నర్స్‌గా తాతాజీ-పీటర్ జట్టు నిలిచింది. విజేతలకు కాకినాడ బ్యాడ్మింటన్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కేబీపీ స్టేడియం నిర్వాహకులు కృష్ణంరాజు షీల్డ్‌లు అందజేశారు.

నేటి నుంచి సత్తెమ్మతల్లి జాతర



ఉండూరు గ్రామంలోని సత్తెమ్మ తల్లి ఆలయం

సామర్లకోట: మండల పరిధిలోని ఉండూరు గ్రామంలో సత్తెమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. బుధవారం వరకు నిర్వహించే ఈ ఉత్సవాలకు ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. సామర్లకోట నుంచి ఉండూరు వెళ్లే రోడ్డులో కొలువై ఉన్న సత్తెమ్మ తల్లి అమ్మవారిని గ్రామ దేవతగా కొలుస్తున్నారు.



గాంధీనగర్ మార్కెట్ వద్ద విక్రయిస్తున్న భోగి పిడకలు



మెయిన్‌రోడ్డుపై నిలిపిన వాహనాలు

పండగ సందడి

- మార్కెట్‌కు సంక్రాంతి శోభ
- కిటకిటలాడిన దుకాణాలు
- ప్రయాణికుల రాకపోకలతో రైల్వేస్టేషన్, కాంప్లెక్స్ రద్దీ

బోట్‌క్లబ్: కాకినాడ నగరానికి పండగొచ్చింది. నగరంలో ఏ వీధి చూసిన్నా ట్రాఫిక్ రద్దీ కనిపించింది. ఏ వస్త్ర దుకాణం చూసినా జనంతో కిటకిటే. ఇక సంక్రాంతికి తమ సొంత ఊళ్లకు వెళ్లే వారితో బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్లు రద్దీగా మారాయి. మెయిన్‌రోడ్డు, భానుగుడి సెంటర్, మసీద్‌సెంటర్, బాలాజీచెరువుసెంటర్, దేవాలయంవీధి, సినిమారోడ్డులోని వ్యాపార ప్రాంతాలన్నీ రద్దీగా మారాయి. నగరంలో ఏ వీధి చూసిన వాహనాలు బారులుతీరాయి. దుకాణాలన్నీ కొనుగోలు దారులతో నిండిపోయాయి.



వస్త్ర దుకాణంలో దుస్తులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

సంతచెరువు జనసంద్రాన్ని తలపించింది. మార్కెట్‌కు వచ్చిన పలువురు వాహనాలు రోడ్డు మధ్యలో పార్క్ చేయడంతో ట్రాఫిక్ సమస్యలు నెలకొన్నాయి. మెయిన్‌రోడ్డు, దేవాలయంవీధిలో ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు పాట్లు పడ్డారు. బొబ్బట్లు, అరిసెలు, సున్నుండలు ప్రత్యేక స్టాల్స్ పెట్టి విక్రయించారు. ఇక నగరంలో పలు మిఠాయి దుకాణాలు వద్ద సంక్రాంతి తినుబండరాలు తయారు చేసి విక్రయించారు. మరికొందరు తమ బంధువులకు ఇచ్చేందుకు స్వీట్ ప్యాకెట్లు తయారు చేసుకోవడం కనిపించింది.

భోగి పిడకల విక్రయం

కాకినాడ నగరంలో భోగి పిడకలు ప్రతీ సెంటర్‌లోను విక్రయించారు. దండ ఒక్కొక్కటీ రూ.60 నుంచి 80 వరకూ విక్రయించారు. భోగి మంటలో పిడకలు వేసేందుకు ప్రజలు వీటిని కొనుగోలు చేశారు.

భోగి భాగ్యాలు

- భోగిమంటలకు సన్నాహం
- పెద్ద పండుగకు సర్వం సిద్ధం
- రంగవల్లుల్లో మహిళలు
- సందడి చేస్తున్న బసవన్నలు

కరప: మండలంలోని భోగి సందడి నెలకొంది. హరినామంతో హరిదాసు పల్లెవాసులను మేలు కొలుపుతుంటే, మహిళలు తమ రంగవల్లులతో ముంగిళ్లకు అందాన్ని అద్దుతున్నారు. చిన్నారులు ఆటపాటలతో, యువత సంప్రదాయ ఆటలతో సందడి చేస్తున్నారు. పంట చేతికి వచ్చి అన్నదాత పెద్ద పండగ చేసుకుంటున్నాడు. ఆదివారం భోగి పండగకు ఇప్పటికే ఎక్కడికక్కడ దుంగలు ఏర్పాటు చేసి భోగి మంటకు సిద్ధం చేశారు. మూడు నాలుగు రోజుల ముందు నుంచే పిడకలతో భోగి దండలతో మాలలల్లారు. సాయంత్రానికి చిన్నారులకు భోగిపళ్లు పోయడానికి పేరంటాళ్లను ఆహ్వానించారు. అలాగే సంక్రాంతికి పితృదేవతారాధనకు అన్నీ సిద్ధం చేసుకున్నారు. కనుమ రోజున కొత్త అల్లుళ్లను పొలిమేర కూడా దాటనీయకుండా చూసుకుంటూ సంప్రదాయం ప్రకారం ఇళ్లలో పూజాదికాలు నైవేద్యాలు సమర్పించేందుకు సర్వం సిద్ధం చేశారు. ముక్కనుమకు మహిళలు బొమ్మల నోమును ఆచరించడానికి, యువకులు గాలపటాలు ఎగరవేసి ఉత్సాహంగా గడుపుతారు.



గ్రామాల్లో సందడి చేస్తున్న డూడూ బసవన్నలు


మరో వైపు కొన్నిగ్రామాల్లో కోడి పందేలకు గుట్టుగా ఏర్పాట్లు ఇప్పటికే జరిగిపోయాయి. ఈ వేడుకకు అంతా సమాయత్తమైపోయారు.



కీర్తనలు ఆలపిస్తున్న హరిదాసు

ప్రజలంతా సంతోషంగా ఉండాలి

ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



కాకినాడ: ప్రజలంతా సుఖ సంతోషాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటనలో సిటీ నియోజకవర్గ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగను ఆనందంగా జరుపుకోవాలని, అన్ని రంగాల్లో మరింత ప్రగతి సాధించాలని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు.

అన్ని వర్గాలకు ఆరాధ్యుడు అంబేడ్కర్

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో సహా అన్ని వర్గాలకు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆరాధ్యుడని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరడ్డి పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీన విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని, స్మృతివనాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్న నేపథ్యంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శి, ఎస్సీసెల్ అధ్యయన కమిటీ సభ్యులు బత్తుల భీమారావు ఆధ్వర్యంలో రూపొందించిన ప్రచార పోస్టర్‌ను ద్వారంపూడి శనివారం ఆవిష్కరించారు. రూ.400 కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ స్మృతి వనం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. అంబేడ్కర్ కలలను సాకారం చేసే దిశగా సీఎం జగన్ పరిపాలన సాగిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, దళిత నాయకులు, వరప్రసాద్, డేవిడ్‌రాజు, బత్తిన రాజు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ రక్షిత నీరు



చీడిగ గ్రామంలో రక్షితనీటి పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా రక్షితనీరు అందించేందుకు వాటర్ ట్యాంక్‌లు నిర్మిస్తున్నట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలో శనివారం పలు గ్రామాల్లో జల్ జీవన్‌మిషన్ నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు, ఇంటింటికీ కుళాయిలు ద్వారా నీటి పంపిణీని ఎమ్మెల్యే చేపట్టారు. గంగనాపల్లి, కొవ్వాడ, రేపూరు, చీడిగ, ఇంద్రపాలెం, కొవ్వూరు, తారకరామనగర్, తూరంగి గ్రామాలలో సుమారు రూ.5.5 కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసినట్టు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో జల్ జీవన్‌మిషన్ నిధులతో సుమారు 138 కోట్లతో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా నీటిని అందించే లక్ష్యంతో ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు నిర్మిస్తున్నామన్నారు. ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, కొప్పిశెట్టి శ్రీను, జేసీఎస్ మండల కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లారీ యజమానుల సంక్షేమానికి కృషి

- సంఘ అధ్యక్షుడు ఎన్ఎస్ రాజు
- రగ్గులు, నిత్యావసరాల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న లారీ యజమానుల సంఘ అధ్యక్షుడు రాజు

కాకినాడ: లారీ యజమానుల సంక్షేమానికి అన్ని విధాలా తోడ్పాటు అందిస్తామని కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ఎస్ రాజు చెప్పారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి ప్రోత్సాహంతో సరళ ఫుడ్స్ అధినేత వినోద్ అగర్వాల్ సమకూర్చిన 1500 రగ్గులను ఆయన లారీ యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లకు పంపిణీ చేశారు. అలాగే మరో 100 మంది స్థానిక డ్రైవర్లు, పెన్షనర్లకు 25 కేజీల బియ్యం, దుస్తులు, నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మోటారు లారీ రంగం కార్మికులు ఆనందంగా ఉండాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ద్వారంపూడి సహకారంతో వీటిని పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మందల వీరప్రతాప్, చిక్కాల సుధాకర్, మట్టా రామకృష్ణ, కోశాధికారి పైలా రాము, సంయుక్త కార్యదర్శులు కొవ్వూరి సుధాకరరెడ్డి, వరిపల్లి శివనారాయణ, కన్వీనర్లు సాగి శివరామరాజు, అల్లం శ్రీనివాసరావు, మట్టా చంద్రశేఖర్, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నీ



కరప హైస్కూలులో సాగుతున్న క్రికెట్ మ్యాచ్

కరప: మండల పరిధిలో యువక్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఏటా సంక్రాంతి సందర్భంగా క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు, సీఏకే అధ్యక్షుడు దేవు మధువీరేష్ తెలిపారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్ టోర్నీలో శనివారం ఏడు మ్యాచ్‌లు జరిగినట్టు ఆయన తెలిపారు. మొదటిమ్యాచ్‌లో వేములవాడజట్టుపై కరప భీమ్ వారియర్స్ జట్టు 7 వికెట్ల తేడాతో, రెండో మ్యాచ్‌లో పెద్దాపుర ప్పాడు జట్టుపై భావారం సూపర్‌కింగ్స్ జట్టు ఏడు వికెట్ల తేడాతో గెలిచాయి. మూడో మ్యాచ్‌లో సిరిపురం యూత్‌పై పెద్దాపురప్పాడు జట్టు 10 వికెట్ల తేడాతో, నాలుగో మ్యాచ్‌లో కరప-11 జట్టుపై కరప మెరకవీధి జట్టు 6 వికెట్ల తేడాతో గెలిచాయి. ఐదో మ్యాచ్‌లో జెడ్.భావారం జట్టుపై గురజనాపల్లి-3 జట్టు 8 వికెట్ల తేడాతో, ఆరో మ్యాచ్‌లో కరప భీమ్ వారియర్స్ జట్టుపై గురజనాపల్లి-3 జట్టు 6 వికెట్ల తేడాతో గెలవగా, ఏడో మ్యాచ్‌లో వేములవాడ-2 జట్టు చేతిలో గురజనాపల్లి-2 జట్టు ఓటమి పాలైంది.

విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో సంక్రాంతి వేడుకలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): స్థానిక అర్బన్ ఎంఆర్ఓ కార్యాలయ ఆవరణలోని ఏపీ స్టేట్ విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో సంఘ అధ్యక్షుడు కె.పద్మనాభం ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా విశ్రాంత ఉద్యోగినులకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. భోగి మంటను వెలిగించారు. ముగ్గుల పోటీలకు సుబ్బలక్ష్మి న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు.

వ్యాయామానికి సమయం కేటాయించాలి

- బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాయిప్రణీత్



సాయి ప్రణీత్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న బీ స్ట్రాంగ్ నిర్వాహకులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): నిత్యం ఒక గంట సమయం వ్యాయామం, యోగా, నడక, ఏదో ఒక క్రీడకు వెచ్చించాలని అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాయి ప్రణీత్ తెలిపారు. శనివారం స్థానిక రాజేశ్వరి నగర్‌లోని బీ స్ట్రాంగ్ వ్యాయామశాలలో నిర్వహించిన వ్యాయామ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. కాకినాడలో పిల్లలు షటిల్ బ్యాడ్మింటన్‌లో విశేష ప్రతిభ చూపడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం పోటీలలోని విజేతలకు బహుమతులు అందజేశారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎం సాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను నియోజకవర్గంలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు శనివారం రాత్రి పంపిణీ చేశారు. క్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 9 మందికి రూ.22 లక్షలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి ఆర్థికంగా చేయూతనిచ్చేలా ముఖ్యమంత్రి సహాయనిధి తోడ్పడుతుందన్నారు. కరప జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి తదితరులు పాల్గొన్నారు.

17న వినికిడి యంత్రాల పంపిణీ

బోట్‌క్లబ్: వినికిడి సమస్య లేని సమాజం కోసం దీన్‌దయాళ్ శ్రవణ ఫౌండేషన్ కృషి చేస్తుందని ఫౌండేషన్ చైర్మన్ రేగుల రామాంజనేయులు అన్నారు. కాకినాడలోని ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలోని ప్రజల కోసం ఈ నెల 17న ఉదయం 10 గంటలకు కాకినాడలోని కాపు కల్యాణ మండపంలోని ఉచిత వినికిడి యంత్రాలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకూ తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 12 వేల మందికి వినికిడి యంత్రాలు అందించినట్లు చెప్పారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలో తోట సుబ్బారావు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం వైద్య శిబిరం నిర్వహించి, పరీక్షించి అవసరమైన వారికి మధ్యాహ్నం వినికిడి యంత్రాలు అందిస్తామన్నారు. తోట సుబ్బారావు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ అధ్యక్షుడు తోట వెంకట సర్వారాయుడు మాట్లాడుతూ వినికిడి సమస్య ఉన్న వారికి వినికిడి యంత్రాలు అందిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకుడు చెక్కా రమేష్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఫౌండేషన్ చైర్మన్ రామాంజనేయులు

పూర్వ విద్యార్థుల పెద్ద మనసు

- ఆర్ఎంసీకి వసతుల కల్పన

కాకినాడ క్రైం: విద్యా బుద్ధులు నేర్చుకుని ఉన్నత స్థాయిలో వెలుగొందుతున్న పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న కళాశాల, అనుబంధ ఆసుపత్రి అభివృద్ధిలో కీలక భాగస్వాములవుతున్నారు. ఆర్ఎంసీ 1998 బ్యాచ్‌కు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థులు రూ.3.5 లక్షల విలువైన డిజిటల్ క్లాస్ రూం బోర్డును ఫోరెన్సిక్ డిపార్టుమెంట్‌కు సమకూర్చారు. ఆ బ్యాచ్ విద్యార్థులైన సైకియాట్రిస్టు డాక్టర్ వానపల్లి వరప్రసాద్, గైనకాలజిస్టు డాక్టర్ కరుణ బోర్డుతో సహా ఏసీ వంటి ఉపకరణాలను తమ బ్యాచ్ తరఫున ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫణికుమార్ బృందానికి అందజేశారు. వీటిని రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు, ఆర్ఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ నరసింహం ప్రారంభించారు. అనంతరం జీజీహెచ్‌లోని ఎస్‌పీఎం గ్యాలరీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో 1972 ఎంబీబీఎస్(జెమ్స్) బ్యాచ్‌కు ఎస్‌పీఎంకు రూ.5 లక్షలు విలువైన డిజిటల్ బ్లాక్ బోర్డు, రెండు టీవీలు సమకూర్చారు. జెమ్స్ బ్యాచ్ తరఫున డాక్టర్ పబ్బిసీడి రఘునాథ్, డాక్టర్ ఎస్‌వీ బాబు, డాక్టర్ జి.రవికుమార్, డాక్టర్ పీఎస్ఎన్ రాజు వీటిని అందజేయగా డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ప్రారంభించారు. ఆయనతో పాటు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీమాధవి 1972, 1998 బ్యాచ్ విద్యార్థుల సంకల్పాన్ని కొనియాడారు. ఎస్‌పీఎం గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎస్‌పీఎం ప్రొఫెసర్ డాక్టర్ సుజాత, సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్, ఎస్‌పీఎం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రుక్మిణి, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



డిజిటల్ బ్లాక్ బోర్డును ప్రారంభిస్తున్న డాక్టర్ నరసింహం

వైభవంగా నీరాటోత్సవం

బోట్‌క్లబ్: ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా గోదా అమ్మవారి కల్యాణోత్సవం సందర్భంగా శనివారం స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో అమ్మవారి అభిషేకాలు నిర్వహించారు. గోదా అమ్మవారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పెళ్లికూతురిని చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారం గోదా కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో నీరాటోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారి కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు.



మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో గోదా అమ్మవారు

చిన్నారుల్లో సేవాభావం అలవరచాలి



బీచ్‌లో సేకరించిన చెత్త సంచుల వద్ద రెయిన్‌బో చిల్డ్రన్ హోమ్ చిన్నారులు

బోట్‌క్లబ్: చిన్నారుల్లో చిన్నతనం నుంచే సేవాభావాన్ని అలవరచాలని హోప్ ఫర్ చేంజ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు లక్ష్మి నాగేంద్ర అన్నారు. సాగర తీరాన రెయిన్ బో చిల్డ్రన్ హోమ్ చిన్నారులతో కలసి శనివారం బీచ్ క్లీనింగ్ చేపట్టారు. సంస్థ సభ్యులు, అలయన్స్ క్లబ్ సేవా శక్తి సభ్యులు, గివ్ ఏ లిటిల్ హోప్ సంస్థ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని సాగర తీరాన్ని శుభ్రం చేశారు. సాగర తీరానికి వెళ్లే ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రెయిన్ బో చిల్డ్రన్ హోమ్ పీఆర్వో కుమార్, అలయన్స్ క్లబ్ సభ్యులు నాగేంద్ర కుమార్, సుభద్ర, గణేష్, నవ్య, అయేషా, కుమార్ రాజా, చిన్నారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తులసి, కుంకుమ పూజలు

సామర్లకోట: మండల పరిధిలో వేట్లపాలెం కెనాల్ రోడ్డులో వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ధనుర్మాసం, శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని తెల్లవారు జామున గోపూజ, ఉదయం అభిషేకాలు, లక్ష తులసీ పూజలు చేశారు. రాత్రి దంపతులచే లక్ష కుంకుమ పూజలు చేశారు. ఈ పూజలను పురస్కరించుకుని ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మధ్యాహ్నం రాత్రి అన్నదానం ఏర్పాటు చేశారు. పారిశ్రామిక వేత్త గోలి ధర్మరాజు, గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు